




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
జూన్ 30, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




# ఎగువ సభలో కొత్త సభ్యుల ప్రవేశం

ఎనిమిది మంది రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారం

మల్లికార్జున ఖర్గేకు మరోసారి సభ్యత్వం

ప్రతిపక్ష నేతగా కొనసాగనున్న కాంగ్రెస్ అధ్యక్షుడు

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ఖర్గే స్పష్టం

ప్రమాణ కార్యక్రమానికి పలువురు జాతీయ నేతల హాజరు

న్యూఢిల్లీ: రాజ్యసభకు ఇటీవల ఎన్నికైన ఎనిమిది మంది సభ్యులు సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసి ఎగువ సభలో తమ బాధ్యతలను ప్రారంభించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, భాజపా నేత తరుణ్ ఛుగ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన మరో ఆరుగురు సభ్యులు ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సమక్షంలో ప్రమాణం చేశారు. కర్ణాటక నుంచి తిరిగి రాజ్యసభకు ఎన్నికైన మల్లికార్జున ఖర్గే పదవీకాలం ఈ నెల 25తో ముగియగా, మరోసారి సభ్యుడిగా ఎన్నిక కావడంతో ఆయనకు రాజ్యసభలో కొనసాగింపునకు అవకాశం లభించింది. దీంతో ఆయన ప్రతిపక్ష నేతగా

(మిగతా 2వ పేజీలో)

## మూసీ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగదు: మంత్రి పొంగులేటి

మూసీ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం అంశాలపై పొంగులేటి సమీక్ష

ఇల్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశం

భూములు కోల్పోయే రైతులకు పరిహారం, పునరావాసం కల్పిస్తామని వెల్లడి



## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క

జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క

కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని వ్యాఖ్య

పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం





## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి... వాటితోనే రేవంత్ గెలిచారా?: కవిత

దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత

బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి

హైదరాబాద్‌లో ఉండే చాలామందికి ఏపీలో కూడా ఓట్లు: కవిత

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని

(మిగతా 2వ పేజీలో)

## బంగాళాఖాతంలో భారత్‌కు డబుల్ టెన్షన్.. చైనా, పాక్‌ల కొత్త వ్యూహం!



బంగాళాఖాతంలో పాకిస్థాన్ అత్యాధునిక జలాంతర్గామి పీఎన్ఎస్ హ్యాంగోర్ సంచారం

చైనా నిర్మించిన ఈ సబ్‌మెరైన్ వారాలపాటు నీటి అడుగున ఉండగలదు

బంగ్లాదేశ్‌లోనూ చైనా నిర్మించిన బీఎన్ఎస్ పెకువా నేవల్ బేస్

ఈ బేస్ పాక్, చైనా సబ్‌మెరైన్‌లకు లాజిస్టిక్స్ హబ్‌గా మారే ప్రమాదం

భారత తూర్పు తీరానికి సమీపంలో పెరిగిన భద్రతాపరమైన సవాళ్లు



# వర్షాల వేళ రైతు సభకు విరామం

ఖమ్మంలో రైతు ఆశీర్వాద కార్యక్రమం వాయిదా

రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ నిర్ణయం

రైతుభరోసా పంపిణీ పూర్తయ్యాక ముగింపు సభ నిర్వహణ

జూలై తొలి వారంలో కొత్త తేదీలపై కసరత్తు

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు: భట్టి

ఖమ్మం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ వద్ద మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రస్తుతం వాయిదా పడిన ఈ సభను రైతుభరోసా నిధుల పంపిణీ పూర్తైన అనంతరం వచ్చే నెలలో ముగింపు సభగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సభ నిర్వహణకు సిద్ధం చేసిన ప్రాంగణాన్ని సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో వేలాది మంది రైతులు పాల్గొనడం ఇబ్బందికరమవుతుందని అధికారులు నివేదించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని సభను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని

(మిగతా 2వ పేజీలో)

# విద్యార్థుల సమస్యలపై పోరాటం కొనసాగుతుంది: నితిన్ నబీన్

రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు

న్యాయం జరిగే వరకు విద్యార్థుల పక్షాన నిలుస్తామని హామీ

జెన్--జీ దేశాన్ని నిర్మించే తరం.. విధ్వంసానికి కాదు సృజనకు ప్రతీక అని వ్యాఖ్య

జీవితంలో అడ్డదారులు లేవు.. సహనం, క్రమశిక్షణతోనే విజయమని యువతకు సూచన

వికసిత్ భారత్ లక్ష్యంలో యువత భాగస్వామ్యం కీలకమని కాన్క్లేవ్‌లో పిలుపు




హైదరాబాద్/ఘట్‌కేసర్: తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను బీజేపీ తీవ్రంగా ప్రస్తావిస్తుందని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. ఘట్‌కేసర్‌లో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన లిలి'వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాన్‌క్లేవ్'లిలిలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో విస్తృతంగా సంభాషిస్తూ విద్య, యువత, దేశాభివృద్ధి, భవిష్యత్ అవకాశాలు వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల ఆలస్యం కావడంతో అనేక మంది విద్యార్థులు, విద్యాసంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు బీజేపీ విద్యార్థుల తరపున పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వంపై

(మిగతా 2వ పేజీలో)



## ఏరువాక పౌర్ణమి సందర్బంగా సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 29

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల సాయిబాబా దేవాలయంలో సోమవారం రోజున ఏరువాక పౌర్ణమి సందర్భంగా సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో పండితులు శివశంకర్ శర్మ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు తమ మొక్కులను చెల్లించుకుని, పిల్లలు కుటుంబ సభ్యులు అందరూ క్షేమంగా ఉండాలని ఆ సాయిబాబాను, దత్తాత్రేయుని వేడుకున్నారు.. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయప్ప ట్రస్ట్ వైస్ చైర్మన్ చెన్నమనేని హిమవంతరావు, గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ మరి పెల్లి నారాయణ గౌడ్, ఎలగందుల రమేష్, మహిపాల్ రెడ్డి, పుటుకం రాజారెడ్డి, పోతవేణి రాజేందర్ గౌడ్, సురకంటి నాగిరెడ్డి, చంద్రకంటి రవీందర్, రాజేశం, లక్ష్మయ్య, రమేష్, లింబాద్రిగౌడ్, మహిళలు యువకులు, తదితరులు పాల్గొన్నారు..




## కళాశాలలో కనీస వసతులకై కలెక్టర్ కు ఫిర్యాదు..

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 29

జగిత్యాల జిల్లాలోని మేడిపెల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు సరిగా లేవని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. జూనియర్ కళాశాలలోని విద్యార్థులు పడుకునే డార్మెటరి హాల్ లో కనీస సౌకర్యాలైన తలుపులు, కిటికీలు లేవని మంచాలు తుప్పుపట్టి వంగిపోయి విద్యార్థులు పడుకోవడానికి వీలు లేకుండా ఉన్నాయని తెలిపారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి గురుకులాలు, మోడల్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరిట వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. మంత్రుల కొడుకులు ముఖ్యమంత్రి కొడుకు ఇలాంటి స్కూల్స్ లోనే చదువుతున్నారా అని ప్రశ్నించారు. వసతి గృహానికి తలుపులు, కిటికీలు లేనందున ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాములు, తేళ్లు, జెర్రులు ఇతర విష పురుగులు ప్రవేశించే అవకాశం ఉందని దానివల్ల విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, గతంలో ఇలాంటి ఘటనలు జరిగి పదుల సంఖ్యలో విద్యార్థులు మృతిచెందిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు. వారం రోజుల్లోగ విద్యార్థులకు మెరుగైన కనీస సౌకర్యాలు సమకూర్చనట్లయితే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



## ఆదర్శంగా నిలిచిన వీరాపూర్ సర్పంచ్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 29


జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ప్రాథమిక పాఠశాల వీరాపూర్ లో గ్రామ సర్పంచ్ అయినటువంటి దిండిగాల గంగు-రామస్వామి గౌడ్ ప్రభుత్వ పాఠశాల పై నమ్మకంతో తమ మనుమరాలు అయినటువంటి దిండిగాల వైశిక ను ఒకటో తరగతిలో చేర్పించడం జరిగింది. అదేవిధంగా వార్డ్ మెంబర్ నీలి మమత తమ కూతురు అయినటువంటి నీలి దాక్షాయని ను 2వ తరగతిలో చేర్పించడం జరిగింది. దీనిని స్ఫూర్తిగా తీసుకొని గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని వీరాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుటకు ఉత్సాహం చూపుతున్నారు. గ్రామపంచాయతీ కార్యవర్గ తీర్మానం మేరకు ఇప్పటివరకు పాఠశాలలో సుమారు 70 మంది పిల్లలు చేరారు. ముగ్గురు ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ , ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రియాన్స్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన- డా, కపిల్ కుమార్ అగర్వాల్ - దివ్య అగర్వాల్

### కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు అల్పాహార వితరణ

వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

శ్రీకృష్ణ గోపాల్ సేవాసమితి ఆధ్వర్యంలో సమితి ఎగ్జిక్యూటివ్ పాక సతీష్ యాదవ్ కుమారుడు రియాన్స్ యాదవ్ జన్మదినం సందర్భంగా నిరుపేద విద్యార్థులకు పాఠశాలలో అల్పాహార సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు పాఠశాల 250 మంది విద్యార్థులు శుభ్రమైన రుచికరమైన పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి రియాన్స్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ -దివ్య అగర్వాల్ దంపతులు విద్యార్థులు, కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు, డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ క్రమశిక్షణతో పెరిగి ఉన్నత విద్యను అభ్యసించి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు



## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచులు..

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 29

జగిత్యాల జిల్లా రాయికల్ మండల వడ్డే లింగాపూర్ సర్పంచ్ బండారి మానస సాయి, రామారావు పల్లె సర్పంచ్ కోటే రాజేందర్, కురమపల్లి సర్పంచ్ మ్యాకల మల్లేష్, వడ్డెర కాలని సర్పంచ్ బోదాసు చంద్ర శేఖర్ జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సమక్షం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అత్యధిక వరి మొక్కజొన్న కొనుగోలు చేసి రైతుల పక్షాన అండగా నిలిచిన రాష్ట్రం తెలంగాణ. శాంతి యుతంగా కలిసి ఉండి,ప్రజా సేవే లక్ష్యం గా అందరం కలసి పనిచేసి గ్రామాల అభివృద్ధి కి తోడ్పడాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ లో చేరడం రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న పనులను నిదర్శనం అన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేయటం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అని అన్నారు.

**జగిత్యాలకు అత్యధిక 14పల్లె దవాఖాన లు మంజూరు.**

విద్య వైద్యం వ్యవసాయం అధిక ప్రాధాన్యత. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ నిధులు మంజూరు..రాయికల్ మండలం లో నూతనంగా మంజూరైన అంగన్వాడీ భవనాలు త్వరిత గతిన పూర్తి చేయాలి అన్నారు. ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికఆహారం, యూనిఫామ్, నాణ్యమైన బోధన అందిస్తున్నాం



అన్నారు. అందరూ కలసికట్టుగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో లైబ్రరీ చైర్మెన్ దినేష్,టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ గిరి నాగభూషణం, రవీందర్ రావు,ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, సమిండ్ల శ్రీనివాస్, సర్పంచ్ ప్రసాద్, బాల ముకుందం, నక్కల రవీందర్ రెడ్డి, ముకేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన కమలం నేతలు"

కల్వకుర్తి జూన్ 29 వార్త మిర్రర్ ప్రతినిధి:-

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని సిల్లారిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు నాప శివ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో సాటి బీజేపీ కార్యకర్తలు, నాయకులు ముందుకు వచ్చి విరాళాలు సేకరించి రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.శివ దశదినకర్మ సందర్భంగా బీజేపీ నేత, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి సేకరించిన నగదును శివ కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్త కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబిదేవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ బోడ నరసింహ, కౌన్సిలర్ ఏనుగొండ రామకృష్ణ, సీనియర్ నాయకులు సూర్యకృష్ణ గౌడ్, నరెడ్ల శేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు గుండోజు గంగాధర్, పట్టణ ఉపాధ్యక్షులు అభి గౌడ్, దేవర్ల



మహేష్, హుస్సేన్, పానుగంటి శివకుమార్, రాగిపాణి కాళిదాస్, దామర్ల శేఖర్, జిల్లెల్ల శివ, అంకిర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గోమాత కరుణతో ఆధ్యాత్మిక ఆనంద వెల్లువ!

### సురబి గోశాల లో ఘనంగా ఏరువాక పౌర్ణమి మహోత్సవం... సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 29

ఏరువాక పౌర్ణమి అనే పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని తాటిపల్లి లోని సురభి గోశాల ఆధ్వర్యంలో నిర్వహించిన గో-వృషభ కళ్యాణ మహోత్సవం, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తి, శ్రద్ధ, వైదిక సంప్రదాయాల సమ్మేళనంగా అత్యంత వైభవంగా జరిగాయి. గోమాతను సాక్షాత్తు సమస్త దేవతల నిలయంగా భావించే భారతీయ సంస్కృతిలో, గో-వృషభ కళ్యాణం అనేది ప్రకృతి, వ్యవసాయం, ధర్మం, కుటుంబ శ్రేయస్సుకు ప్రతీక. ఆ పవిత్ర వేడుకలో పాల్గొన్న ప్రతి భక్తుడూ ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ మహోత్సవాన్ని సురభి గోశాల ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ నరసింహాచార్యులు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజున గోశాలలో భక్తులందరికీ సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం ఎంతో ప్రశంసనీయం. ధర్మ పరిరక్షణతో పాటు కుటుంబ శాంతి, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించే ఈ సేవ నిజంగా ఆదర్శప్రాయమైనది. ఈ కార్యక్రమంలో గోశాల అధ్యక్షులు డాక్టర్ తురగ రాజారెడ్డి, ఉపాధ్యక్షులు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి శ్రీ బండారు కమలాకర్, కోశాధికారి శ్రీ జలగం జలేందర్ రావు, కమిటీ సభ్యులు శ్రీ జిడ్డిగే పురుషోత్తం, శ్రీ కోటగిరి రాజేశ్వర్, శ్రీ సిరికొండ శ్రీనివాస్, శ్రీ రమేష్ , శ్రీమతి ఎలిమిల్ల ఉషా కిరణ్, శ్రీ గంప శివ కుమార్, శ్రీ




గంప ప్రదీప్, శ్రీ తాటికొండ శ్రీనివాస్, తాటిపల్లి సర్పంచ్ శ్రీ బొలిశెట్టి గంగారెడ్డి, గ్రామ కార్యదర్శి, ఉపసర్పంచ్ , మహిళా వార్డ్ మెంబర్స్, ఆశా వర్కర్లు , అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మరింత శోభను తీసుకొచ్చారు. అనంతరం విచ్చేసిన భక్తులందరికీ గోశాల పక్షాన ప్రేమతో, భక్తితో అన్నప్రసాద వితరణ చేయడం కార్యక్రమానికి మరింత పుణ్యప్రదమైన ముగింపునిచ్చింది. గోమాత సేవ అంటే కేవలం జంతు సంరక్షణ మాత్రమే కాదు... అది భారతీయ సంస్కృతిని, వ్యవసాయాన్ని, ధర్మాన్ని, దైవత్వాన్ని కాపాడే మహాయజ్ఞం. ఇలాంటి పవిత్ర కార్యక్రమాలు సమాజంలో సత్సంకల్పాలను పెంపొందిస్తూ, యువతలో సనాతన విలువల పట్ల విశ్వాసాన్ని మరింత బలపరుస్తాయి. గోమాత ఆశీస్సులు ప్రతి ఇంటా ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం నింపాలని... శ్రీ సత్యనారాయణ స్వామి వారి అనుగ్రహం ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని మనసారా ప్రార్థిస్తూ...గోమాతకి జై!

శ్రీ సత్యనారాయణ స్వామికి జై! సనాతన ధర్మానికి జై!

## ప్రభుత్వానికి -- ప్రజలకు మధ్య వారధి మీడియా

### జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేసిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

వార్త మిర్రర్ జగిత్యాల, జూన్ 29

ప్రజలకు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడంలో మీడియా కీలకమైన వారధిగా పనిచేస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు 2026-28 సంవత్సరమునకు గాను అక్రిడిటేషన్ నూతన అక్రిడేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా పౌర సంబంధాల అధికారి వి. శ్రీధర్, విలేకరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్థంభమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాస్తవాలను నిష్పాక్షికంగా ప్రజలకు అందిస్తూ సమాజాభివృద్ధికి జర్నలిస్టులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు జర్నలిస్టుల విధి నిర్వహణలో ఎంతో ఉపయోగపడతాయని, బాధ్యతాయుతమైన వార్తలతో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని



కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా వారధిగా నిలుస్తోందన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు వేగంగా, పారదర్శకంగా చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని అన్నారు. జర్నలిస్టులు వాస్తవాలను ధృవీకరించి బాధ్యతాయుతమైన వార్తలను అందించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరపున మీడియాకు ఎల్లప్పుడూ అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు.

## వేగంగా దర్యాప్తు.. నిందితుడి అరెస్ట్

- రేవల్లి హత్య కేసులో నిందితుడు అరెస్ట్

కల్వకుర్తి, జూన్ 29 వార్త మిర్రర్ ప్రతినిధి:-నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రేవల్లి గ్రామంలో జరిగిన హత్య కేసును ఊర్కొండ పోలీసులు 48 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆదివారం వివరాలను వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం.. రేవల్లి గ్రామానికి చెందిన పోలె అంజనేయులు (28) తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన కల్లె యాదయ్య (50)తో గత కొంతకాలంగా వ్యక్తిగత కారణాల నేపథ్యంలో విభేదాలు కొనసాగుతున్నాయి.ఈ క్రమంలో జూన్ 26న గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద ఇద్దరి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో యాదయ్య కర్రతో దాడి చేయడంతో అంజనేయులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఊర్కొండ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు




తరలించినట్లు వెల్లడించారు.ఈ కేసు ఛేదనలో సీఐ, ఎస్సైతో పాటు ప్రత్యేక బృందం సిబ్బంది కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, డీఎస్పీ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# శ్రీ క్రిష్ణగిరి పాదాల గుట్టపై... క్రిష్ణ పాదాల స్థాపణ ఓ చారిత్రాత్మక గట్టం...

### సనాతన కాలం నాటి ఈ గుట్ట ఓ దైవాంశ వర ప్రసాదం...
### భక్తులకు కొంగు బంగారంగా విరజిల్లబోతున్న శ్రీరాధ క్రిష్ణ ఆలయ క్షేత్రం...







శంకర్ పల్లి మున్సిపల్ వార్త మిర్రర్ జూన్ 29

రాధా క్రిష్ణ భగావన్ కీ జై... క్రిష్ణం వందే జగద్గురుం... అంటూ ఒక పక్క భక్తుల గుండెల్లోంచి హరి నామాలు... మరో పక్క వేద పండితుల నాని పంతుల ఆద్వర్యంలో మరకత శివలింగ నామకరణ భక్తుడు, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ కుటుంబ సభ్యులచే సోమవారం పౌర్ణమి 29న జరిగిన క్రిష్ణ పాదాల స్థాపణ, ధార్మిక పూజలు చూపరులకు కనువిందు చేశాయి. గుట్టపైన కింద ఎటు చూసిన క్రిష్ణ భజనలు, కాశాయ జెండా రెపరెపలు, ప్రకృతి అందాలు భక్తుల హృదయాలను పులకింప చేసాయి. వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా, నవాబ్ పేట్ మండలం, గుబ్బడి పత్తెపురం గ్రామంలో శ్రీ రాధా క్రిష్ణ గోమాత విగ్రహ స్థాపణలు ఈ సంవత్సరం మార్చి నెల 24, 25 తేదీలలో వేద పండితులు నాని పంతులు ఆద్వర్యంలో సాంప్రదాయ బద్ధంగా జరిగిన విషయం తెలిసిందే గత ఏప్రిల్ మే నెలలో పౌర్ణమి పర్వదినానాలలో ఆ అరుణాచలేశ్వర గిరి ప్రదక్షిణలను తలపించే భక్తి భావాన్ని కలిగించేలా గిరి ప్రదక్షిణలు కూడా జరుగుతున్నాయి. సనాతన ధర్మం, పురాతన ఆలయాలను, వాటి చరిత్రలను నేటి సమాజానికి చూపాలన్న ఆశయంతో చందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడు, ఆలయ పునః నిర్మాణ శ్రీకారకుడు, కోటి దీపోత్సవ రాష్ట్ర స్థాయి ధర్మకర్త అవార్డు గ్రహీత, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ (సతీష్ కుమార్) తన తల్లి తండ్రులు కీ.శే.సాయిలు, పద్మమ్మల పేరిట జూన్-29 పౌర్ణమి నాడు గుట్టపై వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా స్థాపణలు కావడం సనాతన ధర్మం వెలుగు చూసినట్లు కావడం విశేషం. గుబ్బడి పత్తెపురం గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు అధిక సంఖ్యల రావడం జరిగింది. ఉదయం నుండి ప్రాంగణంలో అద్యాత్మిక వాతావరణం మనసులను భక్తి పారవశ్యం తో పులకింప చేసింది. అనంతరం గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులందరికి స్వామి వారి తీర్థ ప్రసాదాలతో పాటు, భోజన వితరణ కూడా జరిగింది. అథితులకు స్థాపణ చేసిన వారికి కళావతి, నరేష్ కుమార్, శ్రీరాములు కు గ్రామ పెద్దలు శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధి శ్రీశ్రీశ్రీ చిన్న జీయార్ స్వామి ధర్మ ప్రచార సంస్కార విభాగ్ భాగ్యనగర్ కోఆర్డినేటర్, భాగ్యనగర్ జిల్లా ఛత్రపతి శివాజి యువసేన భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ బైలూరు యూగేష్ ప్రభూజీ మాట్లాడుతూ ప్రతీ ఇంట్లో భగవద్గీత ఉండాలని, ప్రతీ రోజు గుడికి రావాలని తద్వారా మంచి మర్గానికి ఉన్న అలవాట్లు తెలుస్తాయని తెలిపారు. ప్రతీ తల్లి ఒక జీజియా భాయి లా తమ కొడుకులను శివాజీ లా పెంచాలని పేర్కొన్నారు. అన్ని మతస్తులున్న ఈ గ్రామంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్ గుడి నిర్మాణానికి ముందుకొచ్చి, గ్రామస్తుల సహాకారంతో అభివృద్ధి చేయడం పూర్వజన్మ సుకృతం అన్నారు. క్రిష్ణగిరి పాదాల గుట్టపై నరేష్ కుమార్ తల్లిదండ్రులు కీ.శే.సాయిలు, పద్మమ్మల పేరిట అందమైన క్రిష్ణ పాదాలను ఈ పౌర్ణమి నాడు స్థాపణ చేయడం మళ్లీ పూర్వ చరిత్రను తిరగరాసినట్లు అయ్యిందని కొనియాడారు చక్కని వాతావరణంలో ఉన్న ఈ ఆలయ అభివృద్ధికి తాను కూడా కృషి చేస్తానన్నారు. సనాతన ధర్మం, ప్రకృతి పెంపకం పై శ్రద్ధ వహిస్తున్న నరేష్ కుమార్ సేవలు అభినందనీయమన్నారు. పాదుకల స్థాపన చేసిన నరేష్ కుమార్ తో పాటు అక్క నాగమణిలను ఆయన సన్మానించడం జరిగింది. అనంతరం ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ తో పాటు గ్రామస్తులు స్వామి వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రాంలక్ష్మయ్య, భూపతిరెడ్డి, ముదిరాజ్ జంగయ్య, రాజు, నీల జంగయ్య, సేవా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జైరాం రెడ్డి, వైస్ ప్రెసిడెంట్-2 కార్తిక్, జెనరల్ సెక్రటరి వేణేంద్ర చారి, కళావతి, శ్రీరామ్, అంతగోని నర్సింహగౌడ్, జీ.ఎం.కె. ఫౌండేషన్ చైర్మన్ మణికంఠ, శ్రీశైలం గౌడ్, వెంకటేశ్ గౌడ్, శ్రీను, మాజీ సర్పంచ్ రాంచందర్, మరాఠి వెంకటేశ్, సుధాకర్, హరి, రమేశ్, శేఖర్, శ్రీను, కార్తిక్, రాములు గౌడ్, నారాయణ, భజన మండలి జంగయ్య, అనంతయ్య, విధ్యార్థిణి, విధ్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్న అధికారుల నిర్లక్ష్యం

### తెలంగాణ కమిషనర్ ఆదేశాలను లెక్కచేయని అధికారులు:::::::







అచ్చంపేట, జూన్ 29 వార్త మిర్రర్::::::

సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చట్ట స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి ఒక ప్రకటనలో ఆరోపించారు.నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని నాలుగు గ్రామాలు సిద్దాపురం, మన్నేవారి పల్లి, ఐనోల్, బొమ్మన్ పల్లి సంబంధించిన సమాచారాన్ని కోరుతూ 15 నెలల(465రోజులు) క్రితం ఆర్టీఐ దరఖాస్తులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సమాచారం అందించలేదని తెలిపారు. దీంతో జిల్లా కలెక్టర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించగా, కమిషన్ స్పందించి జూన్ 29న సంబంధిత రికార్డుల పరిశీలనకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు.ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం రికార్డుల పరిశీలన కోసం మండల కార్యాలయానికి వెళ్లగా సంబంధిత అధికారులు అందుబాటులో లేక కార్యాలయాలు ఖాళీగా కనిపించాయని పేర్కొన్నారు. అనంతరం మండల ఎంపీడీవోను ఫోన్‌లో సంప్రదించగా, భోజన విరామం కారణంగా అధికారులు బయటకు వెళ్లారని చెప్పి, కొద్దిసేపటి తర్వాత కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు.రికార్డుల పరిశీలనలో భాగంగా నాలుగు గ్రామాలకు సంబంధించిన దస్త్రాలను చూపించాలని కోరగా, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ నుంచి ఎలాంటి లేఖ తమకు అందలేదని అధికారులు చెప్పారని ఆరోపించారు. అయితే కమిషన్ లేఖ అందలేదని లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరడంతో కార్యాలయంలో వెతికి చివరకు కమిషన్ పంపిన లేఖతో పాటు సమాచారం కోసం వచ్చిన మరికొన్ని దరఖాస్తులు కూడా బయటపడినట్లు తెలిపారు.ఈ విషయంపై ప్రశ్నించగా, సంబంధిత అధికారి బదిలీపై వెళ్లిపోయారని, తమకు ఈ వ్యవహారంపై పూర్తి సమాచారం లేదని అధికారులు సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇలాంటి నిర్లక్ష్య, బాధ్యతారాహిత్య వైఖరి కలిగిన అధికారుల వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని గౌరవించకుండా ప్రజలకు సమాచారం అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా లయన్స్ క్లబ్ 'సేవ' ప్రమాణ స్వీకారం

### లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం
### మాజీ గవర్నర్ తీగల మోహన్ రావు





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 29 సమాజ సేవలో ముందుంటూ చౌటుప్పల్ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని లయన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా మాజీ గవర్నర్ తీగల మోహన్ రావు కొనియాడారు.సోమవారం వలిగొండ రోడ్డులోని లయన్స్ భవనంలో నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ 'సేవ' 11వ ప్రమాణ స్వీకార ఉత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి,వేలాది మందికి ఉచిత పరీక్షలు చేయడం జిల్లాలోనే మంచి గుర్తింపు తెచ్చిపెట్టిందన్నారు.అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎండి. అత్తార్ పాషా, కార్యదర్శిగా దాచేపల్లి రాజు, కోశాధికారిగా బత్తిని రఘులతో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోడె సతీష్ ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్‌లో సభ్యురాలిగా ఉండడం తన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా, పోలోజు శ్రీనివాస చారి, గోశిక కరుణాకర్, మొగుదాల రమేష్, బాచుపల్లి రవీందర్, తిరందాస్ జగన్నాథ్, సిలివేరు మంగయ్య, ఉప్పు ఆంజనేయులు, నాంపల్లి రమేష్, కొసనం రాంరెడ్డి, కాసుల వెంకటేశం, కటకం ప్రశాంత్, కామిశెట్టి చంద్రశేఖర్, తిరుమలరెడ్డి, గోపగొనీ లక్ష్మణ్, దాచేపల్లి శ్రీను, భాస్కర్ రెడ్డి, పనిందర్, పోలోజు రాజు, శ్రీనివాస చారి, వనం రాజు, వేముల నరసింహ, సత్యనారాయణ చారి, కాంశెట్టి భాస్కర్, అనిల్, ప్రతాపరెడ్డి, సంపూర్ణ చారి పాల్గొన్నారు.

# రహదారి కాదు.. నరక ద్వారం!

### వర్షపు నీటితో వలిగొండ రోడ్డు అధ్వాన్నం



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 29చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని వలిగొండ ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా అధ్వాన్నంగా మారింది. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో తారు కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతూ గాయాలపాలవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.






## మహిళల అభ్యున్నతికే 'ఇందిరమ్మ మహిళా శక్తి'
## చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 29

మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకాన్ని ప్రవేశపెట్టిందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. సోమవారం చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది.మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్‌లతో కలిసి చీరల పంపిణీని ప్రారంభించారు. ?ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, వారి అభ్యున్నతికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 మహిళా సంఘాలకు చెందిన సుమారు 192 మంది సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. మిగతా వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు ఆయా సంఘాల మహిళలకు చీరలను అందజేశారు.ఈ కార్యక్రమంలో షాదీఖానా చైర్మన్ కరీం, స్థానిక కౌన్సిలర్లు పిల్లలమర్రి మధుసూదన్, ఎండి హన్ను, బత్తుల వాణి విప్లవ్, బద్రి గాలయ్య, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు బాబా షరీఫ్, పస్తం గంగారాములు, సందగళ్ళ విజయ సతీష్ గౌడ్ తదితరులతో పాటు, మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



## మాంగారుబస్తి--అడ్డగుట్టలో భారీ పోలీస్ కార్డన్ సెర్చ్

### 24 వాహనాలు, 15 మద్యం బాటిళ్లు స్వాధీనం -- ప్రజల సమస్యలు తెలుసుకున్న డీసీపీ రక్షిత కృష్ణమూర్తి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 29: లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాంగారుబస్తి--అడ్డగుట్ట ప్రాంతంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ఐపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత స్థాయిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌తో పాటు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ అదనపు డీసీపీ నరసయ్య, చిలుకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, లాలాగూడ పోలీసులు, క్లూస్ టీం, ట్రాఫిక్ సిబ్బందితో పాటు సుమారు 150 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న 24 వాహనాలను పోలీసులు సీజ్ చేయగా, 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐదుగురు రౌడీషీటర్లు, పది మంది అనుమానితులను పోలీసులు తనిఖీ చేసి వారి వివరాలను నమోదు చేశారు.అనంతరం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా డీసీపీ రక్షిత కృష్ణమూర్తి మాంగారుబస్తి--అడ్డగుట్ట ప్రాంత ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.

## పేపర్లలోని బంగారం రేటుకు, దుకాణాల్లోని రేటుకు మధ్య తేడా ఎందుకుంటుంది..? అసలు విషయమిదే..

బంగారం, వెండి ధరలు పేపర్లలో ఒకలా ఉంటే.. షోరూమ్‌లు, దుకాణాల్లో మరోలా ఉంటాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. మేకింగ్ ఛార్జీలు, రవాణా ఖర్చుల సంగతి అటు ఉంచితే.. అనేక విషయాలు ప్రభావితం చేస్తాయి. ముడి రూపంలో కొనుగోలు చేసే వస్తువును ఆభరణంగా మార్చడానికి ఖర్చవుతుంది.బంగారం ధరలు తగ్గాయి లేదా పెరిగాయి అనే వార్తలు మనం తరచూ వింటూ ఉంటాం. ఎప్పుడైనా బంగారం కొనుగోలు చేయాలనుకున్నప్పుడు పేపర్లు, వెబ్‌సైట్లలోని ధరలు పరిశీలించి షాపుకు వెళతాం. కానీ షాపుల్లో ధరలు వేరుగా ఉంటాయి. పేపర్లలో వచ్చిన ధరలకు భిన్నంగా ఉంటాయి. దీంతో ధరల్లో మార్పులను గమనించి ఆశ్చర్యపోతుంటారు. అయితే టీవీలో, పేపర్లలో వచ్చే ధరలకు, షాపుల్లోని రిటైల్ ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. వెబ్ సైట్లు, పేపర్లు, టీవీలలో వచ్చేవి కమోడిటీ మార్కెట్లోని ముడి లోహం ధరలను సూచిస్తాయి. కానీ షాపుల్లో, షోరూముల్లో రిటైల్ ధరలు మరోలా ఉంటాయి. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఎందుకంటే బంగారు ఆభరణాలుగా మార్చడానికి మేకింగ్ ఛార్జీలు, దుకాణాదారుడి లాభాల మార్జిన్ లాంటివి ఉంటాయి. దీంతో పేపర్లలోని బంగారం ధరలకు, షాపుల్లోని ధరల మధ్య భారీ వ్యత్యాసం ఉంటుంది.వెండి ధరల్లో తేడాలు ఎందుకుంటాయి..?ఇక వెండి ధరల విషయానికొస్తే.. ముడి రూపంలో కొనుగోలు చేసి దానిని వస్తువుల రూపంలో మార్చితే కొంత నష్టం జరుగుతుంది. వెండి వస్తువులను తయారుచేస్తే కటింగ్ సమయంలో కొంత మొత్తం పొడి రూపంలో పోతుంది. దీంతో షాపులవారు తరుగు రూపంలో కొంత శాతం కలిపి ధర ఫిక్స్ చేస్తారు. పేపర్లు, టీవీలు, వెబ్ సైట్లలో 99.9 శాతం ప్యూరిటీ ధరలను పేర్కొంటారు. కానీ షాపుల్లో విక్రయించేవి 92.5 శాతం ప్యూరిటీని మాత్రమే కలిగి ఉంటాయి. వీటిని స్టెర్లింగ్ సిల్వర్ అని పిలుస్తారు. వెండి వస్తువులను తయారుచేశాక ఇతర ఛార్జీలను కలిపిన తర్వాత మార్కెట్ ధరలతో పోలిస్తే షాపుల్లో ధరలు ఎక్కువగా ఉంటాయి. దీంత వెండి నాణ్యతను బట్టి ధరలు మారుతూ ఉంటాయి. వెండిలో 80 శాతం సిల్వర్‌తో పాటు 20 శాతం లోహాలు ఉంటాయి. ఇతర లోహలను కలపడం వల్ల ధరలు పెరుగుతాయి.వెండి వస్తువులపై 3 శాతం జీఎస్టీఇక వెండి వస్తువులపై 3 శాతం జీఎస్టీ ఉంటుంది. దీంతో పేపర్లలో వచ్చిన ధరలతో పోలిస్తే షాపుల్లో ధరలు పెరుగుతూ ఉంటాయి. ఇక షోరూములు, దుకాణాల్లో ధరలు ఎక్కువగా ఉండటానికి మరోక కారణం రవాణా ఛార్జీలు, భద్రతా ఖర్చులు కూడా ఒక కారణం. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధరలు ప్రతీ సెకన్ను మారుతూ ఉంటాయి. భారీగా హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటాయి.